క్లుప్తంగా

వాల్మీకి భవన్ మంజూరు చేయాలని వినతి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మేయర్

కర్నూలు (రాజ్‌విహార్): నగరంలో వాల్మీకి భవన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ కోరారు. గురువారం ఎమ్మిగనూరుకు వచ్చిన సీఎంకు మేయర్ వేదికపై వినతిపత్రం అందజేశారు. జిల్లాలో వాల్మీకులు అత్యధికంగా ఉన్నారని, జిల్లా కేంద్రంలో వాల్మీకులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలని సీఎంను బీవై రామయ్య కోరారు.

ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో కొనసాగుతున్న ఓటింగ్ పరికరాల పనితీరును పరిశీలించే ఫస్టు లెవల్ చెక్ ప్రక్రియను కలెక్టర్ డాక్టర జి.సృజన పరిశీలించారు. గురువారం సాయంత్రం ఆమె కేంద్రంలోకి వెళ్లి బెల్ ఇంజినీర్లు చేపడుతున్న ప్రక్రియను పరిశీలించి నిబంధనల మేరకు ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను కొనసాగించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అంతకుముందు ఆమె ఎఫ్‌ఎల్‌సీ సూపర్‌వైజర్, డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఇన్‌చార్జ్ ఏడీగా అనిల్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీగా అనిల్‌కుమార్‌ను ఉన్నతాధికారులు నియమించడంతో ఆయన గురువారం బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఏడీగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఆసుపత్రిలో అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

పెరుగుతున్న ఉల్లి ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి ధరలు పెరిగాయి. ఈ నెల 18న క్వింటాల్ రూ.3,130 ఉన్న ఉల్లి ధర 19న రూ.3,331 చేరింది. గురువారం 37 మంది రైతులు 1,156 క్వింటాళ్ల ఉల్లిని తెచ్చి మార్కెట్‌లో విక్రయించుకున్నారు. కనిష్ట ధర రూ.1950, గరిష్ట ధర రూ.3,331 లభించింది. మోడల్ ధర రూ.2,839 నమోదైంది. ఎండుమిర్చి మార్కెట్‌కు 5 లాట్‌లు వచ్చింది. కనిష్ట ధర రూ.10,501, గరిష్ట ధర రూ.21వేలు కాగా మోడల్ ధర రూ.16,199 నమోదైంది. మొక్కజొన్నలు 153 క్వింటాళ్లు వచ్చింది. కనిష్ట ధర రూ.1,651, గరిష్ట ధర రూ.2,005 లభించగా.. మోడల్ ధర రూ.1,882 నమోదైంది.

రజకులకు సామాజిక రక్షణ చట్టం తేవాలి

కర్నూలు(సెంట్రల్): రజకుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని తేవాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం పూలకుంట గ్రామంలోని కొల్లాపురమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న రజక కుటుంబంపై ఆ గ్రామ సర్పంచ్ మంజునాథ్, అతని అనుచరులు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ముక్కన్న, శేషాద్రి, శ్రీనివాసులు, జయమ్మ, రాముడు పాల్గొన్నారు.

సంతాపం

కర్నూలు (సెంట్రల్): సీపీఐ మద్దికెర మండల నాయకుడు అనుమప్ప అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమని, ఆయన లేని లోటు పార్టీకి తీరనిదని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమప్ప కుటుంబ సభ్యులకు పార్టీ జిల్లా సమితి తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

కర్నూలు సిటీ: మండల పరిధిలోని మిలటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సి.రాజేశ్వరమ్మను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాలయ అధికారి వెంకట కృష్ణారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిడ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేసిన సమయంలో సి.రాజేశ్వరమ్మ ఆ స్కూల్‌లో మన బడి నాడు-నేడు పనులు జరిగాయి. పనుల్లో అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు రావడంతో విచారణ జరిపి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. జిల్లా అధికారుల ముందస్తు అనుమతులు లేకుండా జిల్లా కేంద్రం వదిలి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ ఎముకలకేమైంది!

- మెత్తబడుతున్న ఎముకలు
- ఆస్టియోపోరోసిస్ వ్యాధితో సతమతం
- పాతికేళ్ల క్రితం 60 ఏళ్ల తర్వాత ఈ సమస్య
- ఇప్పుడు యుక్త వయస్సు వారికీ వేధింపు
- జిల్లాలో 5 శాతం మందిలో సమస్య
- నేడు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో మనిషి బిజీ లైఫ్ కారణంగా తన ఆరోగ్యం గురించి పట్టించుకోవడం మానేశాడు. దీనివల్లే ఎన్నో ప్రమాదకరమైన రోగాల బారిన పడుతున్నాడు. ఇందులో బలహీనమైన ఎముకల సమస్య(ఆస్టియోపోరోసిస్) ఒకటి. ఇది ఎన్నో అనారోగ్య సమస్యలకు దారి తీస్తోంది. కానీ దీని గురించి ప్రజలకు తక్కువగా అవగాహన ఉంది. అందుకే ఏటా అక్టోబర్ 20న ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఆస్టియోపోరోసిస్ వ్యాధి(బోలు ఎముకల వ్యాధి) బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ఒకప్పుడు 60 ఏళ్ల తర్వాత కనిపించే ఈ వ్యాధి ప్రస్తుతం 30 నుంచి 40 ఏళ్లలోనే కనిపిస్తోంది. పాతికేళ్ల క్రితం ఇలాంటి సమస్యతో 2 నుంచి 3 శాతం మంది బాధపడే వారు. ప్రస్తుతం 4 నుంచి 5 శాతం మధ్య ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. నడుము, వెన్నెముక, మెడనొప్పి, మోకాళ్లు, కండరాల నొప్పులతో వైద్యుల వద్దకు వచ్చేవారిలో ఆస్టియోపోరోసిస్ సమస్య ఎక్కువగా బయటపడుతోంది. దీనిని ప్రారంభంలోనే నియంత్రించుకోవాలని, లేకపోతే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఆస్టియోపోరోసిస్ అంటే..

ఆస్టియోపోరోసిస్‌ను తెలుగులో బోలు ఎముకల వ్యాధి అంటారు. దీని కారణంగా ఎముక ఖనిజ సాంద్రత తగ్గుతుంది. ఫలితంగా తడిగా ఉన్న గోడ నుంచి ప్లాస్టర్ పడిపోయినట్లుగా ఎముక పౌడర్‌గా పడిపోతుంది. ఈ వ్యాధి కారణంగా ఎముకలు చాలా బలహీనంగా మారిపోతాయి. గతంలో మహిళల్లోనే ఇది ఎక్కువగా కనిపించేది. ఇప్పుడు పురుషుల్లోనూ ఎక్కువగా బయటపడుతోంది. దీని వల్ల వెన్ను, నడుము, మెడ, మోకాళ్లనొప్పులు సర్వసాధారణంగా కనిపిస్తున్నాయి.

ఎందుకు వస్తుందంటే..

సాధారణంగా ఇది 45 ఏళ్లు పైబడిన మహిళల్లో, మెనోపాజ్ దశకు చేరుకున్న వారిలో కనిపిస్తుంది. తగినంత సూర్యరశ్మిని అందని వారు, వ్యాయామం చేయని వ్యక్తులు కూడా దీనిబారిన పడే అవకాశం ఉంది. మద్యపానం, పొగతాగే అలవాటు ఎక్కువగా ఉన్న వారికి, శరీరంలో కాల్షియం స్థాయిలు తక్కువగా ఉన్న వారిలో, కుటుంబంలో ఇంతకు ముందే ఎవ్వరికైనా ఈ వ్యాధి సోకితే జన్యుపరంగానూ ఇది వ్యాపించవచ్చు. ఇటీవల కాలంలో ఎక్కువ మంది ఏసీ సౌకర్యం ఉండే జిమ్‌లలో వ్యాయామం చేస్తున్నారు. అలా గాకుండా పార్కులు, సూర్యరశ్మి తాకే చోట వ్యాయామం చేయడం ఉత్తమం. దీనివల్ల శరీరానికి డి విటమిన్ లభిస్తుంది. దీంతో ఎముకలు బలంగా మారే అవకాశం ఉంటుంది.

వ్యాధి నిర్ధారణ

ఎక్స్‌రే ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించవచ్చు. తక్కువ లక్షణాలు ఉండే వారిలో ఎముకలు పెళుసుగా మారాయని తెలుసుకోలేరు. ఇలాంటి అతి చిన్న లక్షణాలు గుర్తించేందుకు, సరైన చికిత్స అందించడానికి డీఈఎక్స్ స్కాన్(బోన్ డెన్సిటీ స్కాన్) చేయాల్సి వస్తుంది.

ఇవి మానేయాలి

- మితిమీరిన మద్యపానంతో ఎముకలు గుల్లగా మారతాయి.
- ధూమపానంతో ఎముకల సాంద్రత తగ్గి బలహీనమై తేలికగా విరుగుతాయి. శరీరంలోని ఈస్ట్రోజన్ హార్మోన్ సామర్థ్యం తగ్గి ఎముకలు బలహీనమవుతాయి.
- విపరీతంగా వ్యాయామం చేసే అమ్మాయిల్లో అస్తవ్యస్త రుతుక్రమం, ఎముకలు పలచబడతాయి. సరైన ఆహారం తీసుకోకుండా అవసరానికి మించి వ్యాయామాలు చేసే వారిలో ఈ ఇబ్బందులు ఉంటాయి. దీని వల్ల ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గి ఎముకలు బలహీనమవుతాయి.
- శీతల పానియాలు అతిగా తీసుకోవడం. ఇందులో ఉండే అదనపు పాస్ఫరస్ శరీరం కాల్షియం తీసుకునే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

ఇలా చేయాలి

శరీరంలో సరిపడా కాల్షియం లేకపోతే తన అవసరాల కోసం శరీరం ఎముకల నుంచి కాల్షియం తీసుకుంటుంది. ఫలితంగా ఎముకల సాంద్రత తరిగిపోతుంది. కాబట్టి ప్రతిరోజూ ఆహారంలో సరిపడా కాల్షియం శరీరానికి అందిస్తూ ఉండాలి. ఇందుకోసం ఫ్యాట్ ఫ్రీ పాలు, సోయాపాలు, టోఫు, తృణ ధాన్యాలు తీసుకోవాలి. ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే బ్రొకోలి లాంటి కూరగాయలు ఎంచుకోవాలి. విటమిన్-డి కోసం ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. చీజ్, గుడ్లు తినాలి.



సాధారణ ఎముక | వ్యాధి సోకిన ఎముక

ఆస్టియోపోరోసిస్ లక్షణాలు

వెన్నునొప్పి, శరీరాకృతి వంగిపోవడం, ఎత్తు తగ్గుతున్నట్లు కనిపించడం, చిన్న ప్రమాదాలకే ఎముకలు విరిగిపోవడం వంటివి ఆస్టియోపోరోసిస్ వ్యాధి లక్షణాలు. వెన్నుపూసలో పగుళ్లు ఏర్పడితే వెన్నుముక, తుంటి ప్రాంతంలో నొప్పి వస్తుంది. సరైన నివారణ చర్యలు తీసుకోకపోతే కొంత మంది మహిళల్లో ఇది మూపురంలా పెరుగుతుంది. తుంటి ఎముకలో ఏర్పడే పగుళ్లు(హిప్ ఫ్రాక్చర్) త్వరగా నయం కావు. పూర్తిగా కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది.

“ ఎముకలు పటిష్టంగా ఉంచుకోవాలి



ఆస్టియోపోరొసిస్ చిన్నపిల్లల్లో కూడా జన్మతః వస్తుంది. దీనిని ఆస్టియో జనసిస్ ఇన్‌పర్‌ఫెక్టా అంటారు. దీంతో పాటు శారీరక శ్రమ చేయనివారు, సూర్యరశ్మి తగలనివారిలో విటమిన్-డి తక్కువవుతుంది. దీనివల్ల ఎముకల్లో సాంద్రత లోపిస్తుంది. ఈ వ్యాధికి కాల్షియంతో పాటు బిస్‌పాస్పినేట్ మందులు తీసుకోవాలి. సూర్యరశ్మి తగిలేలా కొద్దిసేపైనా ఉండాలి. విటమిన్-డి, కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తినాలి. తద్వారా ఎముకలు పటిష్టంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ టి. విజయ్‌కృష్ణారెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు, కర్నూలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు (రాజ్‌విహార్): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. గురువారం రాత్రి 47వ వార్డులోని 121వ సచివాలయం, శ్రీనివాస్ నగర్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ అరుణ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ దృష్టికి తెచ్చిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకల్లు రైల్వే ప్రసాద్, భారతి, సుధాకర్, సందీప్, లక్ష్మణ్, లాజర్, బాషా, నాగరాజు, నజీర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే నాయీ బ్రాహ్మణులకు గౌరవం



చైర్మన్ పుల్లయ్యకు స్వాగతం పలుకుతున్న సంఘం నాయకులు

కర్నూలు (అర్బన్): రాష్ట్రంలోని నాయీబ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గౌరవం దక్కుతోందని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య అన్నారు. గురువారం ఆయన కర్నూలుకు వచ్చిన సందర్భంలో స్థానిక నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. జగనన్న చేదోడు పథకాన్ని నిర్విరామంగా కొనసాగిస్తూ కుల వృత్తిపై ఆధారపడిన వేలాది నాయీ బ్రాహ్మణులకు ఆర్థికంగా సహాయ సహకారాలను అందిస్తున్నారన్నారు. నాయీ బ్రాహ్మణులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా నిలవాలన్నారు. అనంతరం సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి రమణమూర్తిని ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్ స్వామిచంద్రుడు, కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం



మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: ప్రతిఒక్కరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని మామిదాలపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో అందుతున్న సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని, అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ ఇంటింటికి వైద్యసిబ్బంది వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని, ప్రత్యేక వైద్యులతో చికిత్స చేయించే కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఇలాంటి వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు, అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు భాస్కర్, రాంబాబు, శివ, రామకృష్ణ, యాకోబ్, సీమోన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగనన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్


కర్నూలు సిటీ: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. గురువారం స్టాంటన్‌పురంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో 'ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి' అంశంపై మాట్లాడారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసిన విషయాన్ని, నవరత్న పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చిన విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్ష పార్టీల కుట్ర పూరిత రాజకీయాలను వివరించాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలను ప్రజలకు చేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన అవసరమని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అందరి జీవితాల్లో వెలుగులు రావాలంటే జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు తెలియజేయాలన్నారు.

జగజ్జననీ.. నమోస్తుతే!



రాంబొట్ల ఆలయం నుంచి చిన్నమ్మ వారి శాల వరకు 108 కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం నగరంలోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఓల్డ్‌సిటీలోని చిన్న అమ్మవారి శాలలో సుమారు రూ.2 కోట్ల విలువైన నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం, వన్‌టౌన్ గీతా మందిరంలో మహాలక్ష్మిగా, నాగలాపురం సుంకులమ్మ ఆలయంలో మహాచండీగా, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిగా, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో స్కంద మాతగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయం, పెద్దమ్మవారి శాలలో లలితా దేవిగా, బుధవారపేట కాళికాంబ ఆలయంలో చండీ దేవి, వన్‌టౌన్ కాళికాంబ ఆలయంలో మహా చండీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చిన్మయమిషన్, బండిమెట్ట అంబా భవాని ఆలయం, గంగా మాత ఆలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయం, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు కుమ్మరి వీధి రాంబొట్ల ఆలయం నుంచి పూల బజార్ చిన్న అమ్మవారి శాల వరకు కలశాతో ర్యాలీ నిర్వహించారు.



పెద్దమ్మ వారి శాలలో లలితా దేవిగా..



నిమిషాంబ దేవి ఆలయంలో..



గీతా మందిరంలో మహాలక్ష్మీగా..



కల్లూరులో రాజరాజేశ్వరిగా..

ట్రైనీ జియోలాజిస్టుల జిల్లా పర్యటన

కర్నూలు (న్యూసిటీ): జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)కు చెందిన 28 మంది ట్రైనీ జియోలాజిస్టులు జిల్లాలో మూడు రోజులు పర్యటించనున్నారని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. భౌగోళికంగా జిల్లాలో లభ్యమయ్యే ఖనిజ నిక్షేపాలు, లోహాలు బొగ్గు, సిమెంట్ వివిధ పరిశ్రమలను అధ్యాయనం చేయనున్నారన్నారు. గురువారం ట్రైనీ జియోలాజిస్టులు ఓర్వకల్లులో ఖనిజ నిక్షేపాలను మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా ఈసీ మెంబర్ల నియామకం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పలువురు ఉమ్మడి జిల్లా వాసులు నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రంగోల గోపి శ్రీనివాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా నుంచి కొండా చిన్న మద్దిలేటయ్య, కల్లూరు మండలానికి చెందిన బలిజచముకుల వీరప్ప, కర్నూలు జిల్లా నుంచి వడ్డే శ్రీనివాసులు ఈసీ మెంబర్లుగా ఎంపికయ్యారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

కర్నూలు (న్యూసిటీ): విద్యా వ్యవస్థ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువ చేయాలని బీసీడీఈ సీఈఓ, సెక్రటరీ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ సూచించారు. రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల బీసీడీఈ కో ఆర్డినేటర్లకు (బోర్డు ఫర్ కమ్యూనిటీ డెలవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్) సీఎస్‌పీ ప్రాజెక్టుపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ సీవీ.కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వై.హరిప్రసాద్‌రెడ్డి, బీడీసీఈ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కేవీఆర్‌లో నాయకత్వ లక్షణాలపై సదస్సు

కర్నూలు సిటీ: కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో నాయకత్వ లక్షణాలపై ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, ఉర్దూ యూనివర్సిటీ ఆచార్యులు పి.ఆర్ రెహ్మాన్ హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు మంత్రాలయంలో భారత్ జోడో యాత్ర వార్షికోత్సవం

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర జిల్లాలోకి ప్రవేశించి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో మంత్రాలయంలో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు, ఏఐసీసీ సెక్రటరీ, ఏపీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సీడీ మయప్పన్, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహయాదవ్ హాజరు కానున్నట్లు చెప్పారు.

నేడు పంటల పరిశీలన

కర్నూలు(సెంట్రల్): తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతిన్న పంటలను శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, డి.జగదీష్ పరిశీలించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలూరు, ఆదోని మండలాల్లో పర్యటించి రైతుల కష్టాలను తెలుసుకుంటారన్నారు.

21న కలెక్టరేట్ ఎదుట వీహెచ్‌పీ ధర్నా

కర్నూలు కల్చరల్: టీటీడీ పాలక మండలి ఒక శాతం నిధులను తిరుపతి అభివృద్ధికి కేటాయించాలని తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 21న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి ప్రకటించారు. గురువారం వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక్ ఘాట్ నుంచి కలెక్టరేట్ వరకు సుమారు 1,000 మందితో నిర్వహిస్తున్న ర్యాలీలో వీహెచ్‌పీ, భజరంగ్‌దల్ కార్యకర్తలు పాల్గొనాలన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు నిరసనకు మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, భజరంగ్‌దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, జిల్లా కోశాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.